క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

యానాం: జవహర్ నవోదయ విద్యాలయ మెట్టకూరులో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి ప్రవేశానికి(లేటరల్ ఎంట్రీ) శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు 133 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా వారిలో 112 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

శ్రీధర నిర్మలాశ్రమం 59వ వార్షికోత్సవం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీధర నిర్మలాశ్రమం 59వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆశ్రమ ఉపాధ్యక్షుడు కొపనాతి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు అనేక మంది గురువులు హాజరై గురుబోధ చేశారు. తొలుత శ్రీధర శివరామ దీక్షితుల వారి పాదుకాపూజ, మల్లాడి తాతయార్యుల పూజారాధన, శ్రీ సమరస నిర్మలానంద గంగరాజాచార్యుల వారి 22వ వార్షికారాధన తదితర కార్యక్రమాలు నిర్మలాంబ మహాలక్ష్మమ్మ ఆధ్వర్యంలో వారి కుమారులు, శిష్యబృందం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, మాజీ సర్పంచ్ బర్రే లక్ష్మీనరసింహరాజు, పైడి కొండార్యులు తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రల బహూకరణ

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కి బొమ్మూరుకు చెందిన తాళ్లూరి నాగమణి వంట పాత్రలు బహూకరించారు. రూ.20 వేలు విలువ చేసే గ్లాసులు, కంచాలు, మగ్గుల్ని ఆలయ కమిటీ చైర్మన్ పెనుమత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు దాతను అభినందించి స్వామివారి చిత్రపటం అందజేశారు.

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం పంచాయతీ సిద్ధార్థనగర్ చర్చి ఎదురుగా ఉన్న పంట కాలువలో వ్యక్తి మృతదేహం కనిపించినట్లుగా కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. మృతదేహం కాజులూరు మండలం శ్రీల్లంక గ్రామానికి చెందిన జగడం లోవరాజుదిగా గుర్తించామన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేరీమాత 14వ వార్షికోత్సవాలు

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి గ్రామంలో మేరీమాత 14వ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మత గురువులు సీహెచ్ సురేష్, మందపాటి రాజా ఆధ్వర్యంలో దివ్య పూజా బలి కార్యక్రమం చేసి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. గెద్దం సుబ్బారావు, అంజలి దంపతులు సమకూర్చిన చీరలను సర్పంచ్ గెద్దం స్వరూపరాణి వృద్ధులకు అందించారు. ఈ కార్యక్రమంలో గెద్దం సురేష్‌బాబు, ఆర్.ప్రసాద్, పి.బాలరాజు, బి.పాల్, గెద్దం గోపాలరావు, లాజర్, దేవరపల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ భగవాన్ బాలయోగి గుడి వద్ద గాలిదేవర పెదబాబు ఇంటి ఆవరణలో శనివారం తాచుపాము హల్‌చల్ చేసింది. పామును చూసి భయకంపితులైన పెదబాబు కుటుంబసభ్యులు బీమనపల్లికి చెందిన స్నేక్ స్నాచర్ గణేష్‌వర్మకు సమాచారమిచ్చారు. వర్మ వచ్చి పామును బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పామును జన సంచారం లేని ప్రాంతంలో విడిచిపెడతామని వర్మ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 1262 కేసుల పరిష్కారం

అమలాపురం టౌన్: స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మొత్తం 1262 కేసులు పరిష్కారమయ్యాయి. 13 సివిల్ కేసులు, 1175 క్రిమినల్ కేసులు, 33 మోటారు సైకిల్ ప్రమాదాల కేసులు, 41 బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కార మయ్యాయని కోర్టు కార్యాలయం తెలిపింది. సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, జూనియర్ సివిల్ జడ్జిలు ఎ.హిమబిందు, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు

శివకోటి లిఖిత ప్రతుల నిక్షిప్త మందిరం ప్రారంభం


శివకోటి నామ ప్రతుల నిక్షిప్త మందిరం

ముమ్మిడివరం: కొత్తలంక పార్వతీ సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో కోటి శివనామ లిఖిత జప మహాయజ్ఞంలో భాగంగా భక్తులు రాసిన శివకోటి నామ ప్రతుల నిక్షిప్త మందిరాన్ని శనివారం ప్రారంభించారు. నడిమిల్లంకకి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు, అన్నపూర్ణ దంపతులు నిర్మించగా మందిరానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు రాసిన శివకోటి ప్రతులను మహాశివరాత్రి పర్వదినం రోజున రాత్రి 11 గంటలకు నిక్షిప్తం చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రత్నాప్రకాష్, పి.ఉదయ భాస్కరవర్మ, కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మ జాతరలో సాంస్కృతిక శోభ

- ఆద్యంతం కట్టి పడేసిన జానపద నృత్యాలు, సంగీత విభావరిలు
- నేడు అమ్మవారి తీర్థ మహోత్సవాలు


శక్తి వేషధారణలు


గరగ నృత్యాలు


సత్తెమ్మ తల్లి అమ్మవారు


ఆకట్టుకున్న జానపద నృత్యం

ముమ్మిడివరం: సిరుల తల్లి.. కల్పవల్లి.. భక్తుల పాలిట కొంగు బంగారం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి సన్నిధి కళలకు పెన్నిధిగా నిలిచింది. అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా నిర్వహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నాటకాలు, బుర్రకథలు, కూచిపూడి నాట్యం, జానపద గేయాలు, సంగీత విభావరిలు ఆద్యంతం కట్టి పడేస్తున్నాయి. ఉత్సవాలకు మరింత సొబగులను అద్దుతున్నాయి. ఈ నెల 8 నుంచి జరుగుతున్న అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు నాటక పరిషత్, నృత్య కళాకారులు, జానపద, సంగీత, వాయిద్య కళాకారులను ప్రోత్సహిస్తూ సంస్కృతి సంప్రదాయలకు పెద్ద పీట వేస్తున్నారు.

నేడు తీర్థ మహోత్సవాలు

ఐదురోజులుగా అమ్మవారి జాతర నిర్వహించిన నిర్వాహకులు ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ సుమారు 2000 మంది కళాకారులు వివిధ వేషధారణలు, జానపద నృత్యాలు, గరగ నృత్యాలు, గిరిజన నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ సెట్టింగులతో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అమ్మవారి సన్నిధిలో సుమారు 30 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.

వివాహ వేడుకకు హాజరైన మంత్రి విశ్వరూప్


ఉమ్మడి తూర్పుగోదావరి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అంజలి దంపతుల కుమారుడు నిఖిల్‌కృష్ణ, దివ్యల వివాహం రాజమహేంద్రవరం చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి గార్డెన్స్‌లో శనివారం అత్యంత వైభవంగా జరిగింది. వివాహానికి రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

ప్లాస్టిక్‌తో ఆకలి తీరదు గోమాతా


ఎస్.యానాం డంపింగ్ యార్డులో ప్లాస్టిక్ సంచులను తినేస్తున్న ఆవులు

ఉప్పలగుప్తం: ప్రజలు తమ ఇళ్లలో వచ్చే వ్యర్థాల్ని, మిగిలిపోయిన ఆహార పదార్థాల్ని ప్లాస్టిక్ సంచులతో ఇస్తుండడంతో వాటిని తీసుకెళ్లి డంపింగ్ యార్డులో పడేస్తున్నారు. పశువులు ఆకలితో డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థ పదార్థాలతో పాటు ప్లాస్టిక్ కవర్లను సైతం తినేస్తున్నాయి. శనివారం మండల పరిధిలోని ఎస్.యానాం గ్రామంలో కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది. ప్లాస్టిక్ కవర్‌లను తిని పశువులు అనారోగ్యం పాలై మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించినా యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంతో పశువులకు ప్రాణనష్టం జరుగుతుందని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్మకర్తలు ఆలయాల అభివృద్ధికి పాటు పడాలి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్


నూతన ధర్మకర్తల మండలి అభినందన సభలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ఆలయాలకు నియమితులయ్యే ధర్మకర్తల మండళ్లు ఆయా ఆలయాల అభివృద్ధే ధ్యేయంగా పాటు పడాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణ దేవతలు సుబ్బాలమ్మ, నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల ఆలయానికి నియమితమైన నూతన ధర్మకర్తల మండలికి శనివారం జరిగిన అభినందన సభకు మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో బి.వీర వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆలయ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ బిళ్ల మల్లిఖార్జునరావు, ధర్మకర్తలను మంత్రి విశ్వరూప్ అభినందించారు. ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. తొలుత మంత్రి విశ్వరూప్‌కు ఆలయ అధికారులు, నూతన ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవార్లను మంత్రి విశ్వరూప్ దర్శించుకుని పూజలు చేశారు. పట్టణ ప్రజలకు అత్యంత నమ్మకమైన అమ్మవార్ల ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని నూతన ధర్మకర్తల మండలి తరపున చైర్మన్ మల్లిఖార్జునరావు హామీ ఇచ్చారు. అభినందన సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, యండమూరి గంగ, బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, కొల్లాటి దుర్గాబాయి. మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ చేయించారు.. ఉసూరుమనిపించారు

యానాం: నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధకారులు, ఉద్యోగులు, సిబ్బందికి తాగునీరు సైతం ఏర్పాటు చేయక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఇందిరాగాంధీ మార్కెట్ సెంటర్, గోదావరి తీరం, జీజీహెచ్, వివిధ పాఠశాలల్లో సాగిన మాక్‌డ్రిల్‌లో ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ, వైద్య, మున్సిపాలిటీ, పీడబ్ల్యూడీ, విద్యుత్ తదితర శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనాలు ఏర్పాటుచేస్తారని భావించినా అవీ లేకపోవడంతో అలిసిపోయిన సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఇదే విషయంపై అన్ని శాఖల్లోను చర్చ సాగుతోంది.

ఘనంగా అచల పరిపూర్ణ ప్రథమ వార్షికోత్సవం


అచల పరిపూర్ణ లక్ష్మీనారాయణ ఆశ్రమ వార్షికోత్సవ పూజలు

యానాం: యానాం పట్టణ పరిధిలోని అగ్రహారం ఓం శ్రీఅచల పరిపూర్ణ లక్ష్మీనారాయణ శాంతియోగాశ్రమ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామదండయ్యదాస రాజయోగేంద్రులు శ్రీమాతాకామేశ్వరమ్మ, శ్రీభజేనారాయణదాసు ఆశీస్సులతో గురుపుత్రులు అగ్రహారం శిష్యబృందం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా కోదండరాముల విగ్రహ ప్రతిష్ఠ


పోలేకుర్రులో ప్రతిష్ఠించిన కోదండ సీతారాముల విగ్రహాలు

తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామంలో పునర్నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో వేద పండితులు ఏలూరిపాటి ప్రభాకరశర్మ నేతృత్వంలో ఉదయం 8.43 నిమిషాలకు శ్రీహనుమాన్, లక్ష్మణ, సీతా సమేత కోదండరాముడి విగ్రహాల పునఃప్రతిష్ఠ చేశారు. ఉదయం 6 గంటలకు గణపతిపూజ, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి శాంతి కల్యాణం కన్నుల పండువగా జరిపించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బాలికల కోలాట ప్రదర్శన


వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బాలికలు చేస్తున్న సంప్రదాయ కోలాట ప్రదర్శన

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం 200 మంది బాలికలు కలిసి చేసిన సంప్రదాయ కోలాట ప్రదర్శన అందరినీ అలరించింది. తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కోలాట భజన మండలి ఈ సంప్రదాయ ప్రదర్శన నిర్వహించింది. కోలాట గురువు ఆండ్రు సురేష్‌బాబు పర్యవేక్షణలో 200 మంది బాలికలు ఒకేసారి చేసిన కోలాటం లయబద్ధమైన సంప్రదాయ గీతాలు, నృత్యాలతో సాగింది. ప్రదర్శనను రాత్రి 11 గంటల వరకూ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగు నీరివ్వాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని శివారు భూములకు సాగునీటిని పూర్తి స్థాయిలో అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు, పత్తిగొంది, చొల్లంగి, కోరంగి, జి.వేమవరం, ఉప్పంగల తదితర గ్రామాల్లో శివారు భూములకు నీరందక పొలాలు ఎండిపోతున్నాయన్నారు. పరిస్థితి చేజారకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వెంకన్న ఆలయానికి రూ.50 వేల విరాళం


ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి రూ.50 వేల విరాళాన్ని అందిస్తున్న దాత సత్తిబాబు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల నుంచి సమకూరుతున్న విరాళాలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి అన్నారు. పట్టణానికి చెందిన బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బోణం సత్యవర ప్రసాద్(సత్తిబాబు) దంపతులు ఆలయానికి రూ.50 వేల విరాళాన్ని శనివారం సమకూర్చారు. ఆలయంలో రాతి శిఖరాలకు పాలిష్ పనుల కోసం వెచ్చించేందుకు వారు ఈ విరాళాన్ని అందించారు. దాత సత్తిబాబు దంపతులకు చైర్‌పర్సన్ వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు స్వామివారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, కుసుమ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కళాశాల అధ్యాపకులు

అల్లవరం: నెహ్రూ యువ కేంద్రం నవభారత్ యువ నిర్మాణ సంఘ్ ఆధ్వర్యంలో గుడ్డివానిచింత వద్ద రవితేజ కళాశాల గ్రౌండ్‌లో యువతీయువకులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. నవభారత్ యువ నిర్మాణ సంఘ్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ బల్ల వెంకటరమణ విజేతలకు జ్ఞాపికలు, ప్రభుత్వం తరఫున ప్రశంసా పత్రాల్ని అందించారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను కాకినాడలో జరగబోయే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని ఉదయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బొంతు శివాజీ, గాలి సుబ్రహ్మణ్యం, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జోనల్ స్పోర్ట్స్ మీట్


బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఆర్‌ఓ సత్తిబాబు తదితరులు

అమలాపురం రూరల్: భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో పాఠశాల హెడ్ జీవీ శ్రీనివాస్ అధ్యక్షతన రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

127 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్


మద్యం సీసాలతో పట్టుబడిన నిందితుడు దుర్గాప్రసాద్‌తో తాళ్లరేవు ఎస్‌ఈబీ పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చి అనధికార విక్రయాలు సాగిస్తున్న మేడిశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవానీ తెలిపారు. పాతకోరంగి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో దుర్గాప్రసాద్ పట్టుబడ్డాడన్నారు. అతడి వద్ద నుంచి 127 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని కాకినాడ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా అతడికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, కానిస్టేబుల్స్ డి.శ్రీనివాసరావు, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


మొగళ్లమూరులో ఈ-పంట నమోదును తనిఖీ చేస్తున్న అడిషనల్ డైరెక్టర్ వినయ్‌చంద్ తదితరులు

అల్లవరం: సాగు చేస్తున్న ప్రతి రైతూ ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ జి.వినయ్‌చంద్ ఆదేశించారు. శనివారం మొగళ్లమూరు గ్రామంలో ఈ-పంట నమోదును ఆయన తనిఖీ చేశారు. ఈ ప్రక్రియ సక్రమంగా జరిగిందా లేదా అని సూపర్ చెక్ రూపంలో ఏడుగురు రైతుల పేర్లు, సర్వే నంబర్లు, సాగు విస్తీర్ణం, పంట పేరు, నాటిన తేదీ, పంట రకం, నీటిసాగు పద్ధతి తదితర వివరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతులకు సంక్షేమ పథకాలు అందాలంటే ఈ-పంట నమోదు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. తద్వారా పంట నష్ట పరిహారం, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, ధాన్యం కొనుగోలు తదితరాలు అమలు అవుతున్నాయన్నారు. మొగళ్లమూరులో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని గుర్తించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఏ షంషి, సర్పంచ్ రాయుడు విష్ణు, వ్యవసాయ అధికారులు మురళీధర్, ఎన్‌వీవీ సత్యనారాయణ, వీఆర్వో చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలి

ముమ్మిడివరం: పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ కమిషనరేట్ అడిషనల్ డైరెక్టర్ జి.వినయ్‌చంద్ సూచించారు. ముమ్మిడివరం మండలం బొండాయికోడు వద్ద క్షేత్రస్థాయిలో పంట నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. రైతుల ఈకేవైసీ ద్వారా పంట వివరాల ధ్రువీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అందించే వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట ఉత్పత్తుల కొనుగోలు, పంట నష్టం, పంటల బీమా, పంట రుణాలు వంటి పథకాలు అందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు, సహాయ వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్, మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ ఉన్నారు

హోమాలు, నోములకు చిత్తూరు చిట్టి గుమ్మడి కాయలు


అమలాపురం వారాహి హోమం వద్ద చిన్నారుల చేతుల్లో చిత్తూరు చిట్టి గుమ్మడి కాయలు

అమలాపురం టౌన్: సాధారణంగా గుమ్మడి కాయలు బిస్కెట్ కలర్‌తో రెండు కిలోల నుంచి పది కిలోల బరువుతో ఉంటాయి. అయితే చిత్తూరు జిల్లాలో హైబ్రిడ్ వంగడాలతో పండుతున్న గుమ్మడి కాయలు ఆరెంజ్ కలర్‌లో 100 గ్రాముల నుంచి 300 గ్రాముల బరువుతో పరిమాణం, ఆకారంలో చిన్నవిగా ఉంటున్నాయి. జిల్లాలో నిర్వహించే నోములు, హోమాలకు ఈ చిట్టి గుమ్మడి కాయలు ఎక్కువగానే దిగుమతి అవుతున్నాయి.

పశువైద్యులకు షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్


షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలై అందుకున్న షీల్డ్‌లతో డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ విజయారెడ్డి

అమలాపురం టౌన్: ప్రపంచ పశు వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విజయనగరంలోని స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో ఆరు జిల్లాల పశు వైద్యులకు షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం జరిగింది. పోటీల్లో 45 ఏళ్ల వయసు విభాగంలో కాకినాడ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ అంబేడ్కర్, అమలాపురం పశు సంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయారెడ్డిలు డబుల్స్‌లో విజేతలుగా నిలిచారు. అంబేడ్కర్, విజయారెడ్డిలు ఫైనల్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులతో తలపడి విజేతలయ్యారు. విజయనగరం జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కిషోర్, డిప్యూటీ డైరెక్టర్ జ్ఞానానందం చేతుల మీదుగా షీల్డ్‌లు అందుకున్నారు. టోర్నమెంట్‌లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా ఉమ్మడి జిల్లాలకు చెందిన 65 మంది పశు వైద్యులు పాల్గొన్నారు. విజేతలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ జయపాల్ అభినందించారు.

పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి

అమలాపురం రూరల్: పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జాతీయవాది అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు అన్నారు. ఉపాధ్యాయ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు వెంపరాల భాస్కర్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి దూరి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకటరారావు, నాయకులు, తాతారావు, చిట్టూరి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.